# నలుసంత నమ్మకం

ఆదివారం లంచ్‌దాకా గడవడం పెద్ద సమస్యకాదు. పొద్దెక్కి లేచి శ్రీభాగవతం చూస్తూ వంటచేసి, బాలూగారు పిల్లలతో కలిసి చేసే అల్లరి భరిస్తూ రాగాలు వింటూ పెళ్ళి పుస్తకం చదివేటప్పటికి భోజనాల టైము అయిపోతుంది. కానీ భోజనం అయ్యాక గడవటమే పెద్ద కష్టం. హాయిగా పగటి నిద్దర పోవాలంటే సుష్టుగా భోజనం చెయ్యాలి కదా! కానీ ఈ మధ్య దిక్కుమాలిన డైటింగ్ ప్రోగ్రాం పెట్టుకోవడంతో మెతుకు మెతుకూ లెక్కెట్టుకుని తూచుకుని తిని మళ్ళీ అరగంటకే డబ్బాలు వెతుక్కుంటూ కూచోవలసి వస్తోంది. అయినా ప్రయత్న లోపం ఉండకూడదు కదా. పగటి నిద్దరకి కావలసిన వనరులన్నీ సమకూర్చుకుని పక్క మీదకి చేరాను. ఎంచక్కా టివిలో రామారావు సావిత్రి కళ్ళకి పండుగ చేస్తున్నారు. వాళ్ళనో అయిదు నిమిషాలు చూస్తే ఎలాగూ మనసు హాయిగా పాతికేళ్ళు వెనక్కి పరిగెత్తి జీవితమంతా ముందుందని పిస్తుంది. కలలు కనడానికి రెడీగా కళ్ళు మూసుకుపోతాయి. ఇంత చక్కటి స్థితిని పాడుచేస్తూ ఫోను మోగింది.

అసలు సివిలైజ్డ్ ప్రపంచంలో జీవించే వాళ్ళెవరైనా మాలాంటి కష్టజీవులని ఆదివారం మధ్యాహ్నం ఫోనులో పలకరించే ప్రయత్నం చేస్తారా? వాళ్ళ దారిన వాళ్ళే పోతార్లే అనుకుని మేం ఎవరమూ కదల్లేదు. కానీ అవతలి వాళ్ళు మా కన్నా మొండివాళ్ళల్లా ఉన్నారు. ఎత్తే వరకూ ఊరుకోలేదు. ట్రంకాలట. అసలా పేరు విని ఎన్నాళ్ళయిందో. వాడవాడకీ వీధివీధికీ ఎస్‌టిడి లొచ్చేశాక ఇంకా ట్రంకాల్స్ మీద ఆధారపడే వాళ్ళెవరుంటారబ్బా! అదీగాక పంజాబ్ నించి మాకు చేసే వాళ్లెవరో! నన్ను ఫోను పుచ్చుకుని వేళ్ళాడమని ఆర్డరేసిన ఆవిడ ఒక యుగం తర్వాత కనెక్షనిచ్చింది.

ఎవరిదో పెద్దాయన గొంతు "ఈజ్ ఇట్ మిష్టర్ రంగారావ్స్ రెసిడెన్స్?" అని అతి స్వచ్ఛమైన బ్రిటీష్ యాక్సెంట్‌లో అడుగుతున్నారు. నాకొచ్చిన యాక్సెంట్‌లో అవునన్నాను. నేను నేనేనా అని అడిగారు. 'అవునూ' అన్నాను. అయామ్ వెరీ వెరీ సాగ్ క్షమాకీజియే.... అని అన్ని భాషలలోనూ క్షమాపణలు కోరుతుండగానే లైను కట్టయిపోయింది. మళ్ళీ మోగుతుందేమోనని పది నిమిషాలు నిలబడ్డాను. ఎంతకీ మోగకపోవడంతో గదిలోకి వచ్చి నా నిద్దర ప్రయత్నం

కొనసాగించాను. ప్రయత్నం చేయడం ఆపేసేవరకూ అపజయం కింద లెక్క రాదని ఎక్కడో ఇంగ్లీషులోనే చదివాను.

"ఫోనెవరు? తెలుసుకోవచ్చా" అని మా ఆయన అడిగారు.

"ఎవరో పంజాబ్ నుంచట. సీమదొరల యాక్సెంటుతో బ్రహ్మాండమైన ఇంగ్లీషు మాట్లాడాడు. పెద్దాయనలా ఉన్నాడు. పరిపరి విధాల క్షమించమని బతిమాలాడు. ఈ లోపల ఫోను కట్టయింది. ఎవరో తెలియక నేనే ఛస్తున్నా! మీకేవన్నా తెలిస్తే చెప్పండి!"

"నాకెలా తెలుస్తుంది! ఆయన ఎవరి పేరడిగారు?"

"మీ పేరే అడిగారు! మిమ్మల్ని అడిగేవాళ్ళే ఇంత చాదస్తంగా ఉంటారు. స్టైలుకి తక్కువ లేదుగానీ పేరు చెప్పవయ్యా మహానుభావా అంటే క్షమాపణలు చెప్తాడు!"

"ఇంకా నీకు జ్ఞాపకం రాలేదా? ఒక్కసారి గుర్తు చేసుకో!"

"ఆలోచించే ఓపికలేదు! మీకు తెలిసిందిగా చెప్పండి!"

"ఈ పూటకి ఇదే నీకు హోం వర్కు" అని తను హాయిగా గుర్రుపెట్టడం మొదలుపెట్టారు. ఇలా చేస్తేనే మరి పగతీర్చుకోవడం అంటారు. పరీక్షలు పెట్టడానికీ హోం వర్కులు ఇవ్వడానికీ ఇదా టైము! నాకెందుకీ పజిలూ! నా కేనా అంత చేత కానిది! నేనూ ఆలోచించగలను. అసలు ఈయన గురించి అడిగే వాళ్ళు పట్టుమని పది మంది కూడా ఉండరు. ఎవరి సాయమూ అక్కర్లేదు. నేనే ఆలోచించి నా సొంత తెలివితో ఆ మనిషెవరో కనుక్కోగలను.

"ఎవరబ్బా! పంజాబ్‌లో ఉంటూ కూడా ఇంత చక్కటి ఇంగ్లీషు మాట్లాడడం ... మగవాళ్ళు ... ఈయన గురించే ముందు అడిగారూ ... ఎస్‌టిడి చేయలేదు అంటే ఇంట్లోంచే కాల్ బుక్ చేసి ఉంటారు ... అంటే పల్లెటూరి నించి అయివుండచ్చు. బాగా పెద్దవాడయి ఉండచ్చు ... ఎవరబ్బా ... ఆ తెలిసింది ... తెలిసింది ... కానీ అతనయేందుకు వీలులేదే! ముప్పై ఏళ్ళ క్రితమే అరవై ఏళ్ళవాడు కదా! ఈ పాటికి పోయుండడూ..."

"ఏవండోయ్! తెలిసిందిలెండి! సుర్జిత్‌సింగా?"

"కరెక్టే"

"ఏం కరెక్టూ! ఇంకా ఎలా బతికుంటాడూ? అప్పటికే అరవై ఏళ్ళ వాడయితే?"

"తొంభై ఏళ్ళవాళ్ళు బతక్కూడదని ఎక్కడా రాసిలేదు. ఎవరన్నా ఎప్పుడన్నా పోవచ్చు! ఎన్నాళ్ళన్నా బతకొచ్చు. ఖచ్చితంగా అతనే అయివుంటాడు. అయినా అప్పుడతని వయస్సు ఏభైలోపే! ఆ రోజుల్లో మగాళ్ళు రంగేసుకునే వారు కాదు కాబట్టి నీకలా కనిపించేవాడేమో!"

నాకయితే నమ్మబుద్ధి కావడంలేదు. "ఏవండీ! మన్ని క్షమించమంటా దేవిటి? మనకి అతను ఏం అపకారం చేశాడనీ అంత ప్రాధేయపడడం?"

"అబ్బ! క్షమించమంటే లిటరల్‌గా కాదు. అదో మర్యాద. ఒకవేళ మధ్యాహ్నం నిద్దర లేపినందుకై ఉండచ్చు. ఎందుకడుగుతున్నాడో రేపో మళ్ళీ పదేళ్ళకో ఫోన్ చేస్తే తెలుస్తుంది. ఈ లోపల ఏ ఫోనొచ్చినా నువ్వే తీసి మాట్లాడుతుండు."

నా బతుకెంత వేళాకోళమై పోయిందందరికీ! అస్తమానం ఫోను మాట్లాడ తాననే కదా వీళ్ళకి చులకన! ఎప్పటికైనా మా ఇంట్లో వాళ్ళకి నా ఫ్రెండ్సుతో అవసరం పడకపోతుందా! నన్నోమాట ఫోనులో అయినా చెప్పమని అడక్క పోతారా! అప్పుడు చూసుకోవచ్చు వీళ్ళ సంగతి. అసలింతకీ ఆ ఫోను సుర్జిత్ సింగ్‌దేనా? అతనింకా బతికే ఉన్నాడా? ఈ ముప్పై ఏళ్ళల్లో ఒక్కసారైనా ఎందుకు తగల్లేదో! మరి ఇప్పుడెందుకు చేసినట్లు! మేం హైదరాబాద్ వచ్చి పరిశ్రమ రంగంలో చేసిన ఈ సాహస యాత్రలో ఎంతమంది వ్యక్తులు వచ్చి పోయారో! మరి ఇతని పరిచయం ఇంచుమించు మాకు గతజన్మలాటిది కదా! ఎంత ప్రయత్నించినా, మొఖం కూడా గుర్తుకి రావడం లేదు.

ఇప్పటి రీసెర్చి స్కాలర్స్ సంగతి నాకు తెలియదుగానీ ఆ రోజుల్లో పెళ్ళయి పిల్లా పాపాగానీ ఉండుంటే వాళ్ళని హాస్టల్లో ఉండనిచ్చేవారు కాదు. అమెరికాలో పనిచేసి ఇండియాకి తిరిగి వచ్చిన 'పూల్ ఆఫీసర్ల'కి మాత్రం చక్కటి ఎకామడేషన్ హాస్టల్లో దొరికేది. మా అదృష్టం కొద్దీ ఇద్దరు రీసెర్చి స్కాలర్స్ = ఒక పూల్ ఆఫీసరు అని ఈక్వేషన్ వేసుకుని మాకు ఒక సూట్ ఎలాట్ చేశారు. అందులో మేము ప్రవేశించిన రోజున నాకు కలిగిన సంతోషం, ఆ తరువాత పదేళ్ళకి మేం హైదరాబాద్‌లో సువిశాలమైన స్వంత ఇంట్లోకి వచ్చినప్పుడు కూడా కలుగలేదు. ఎందుకంటే అప్పటి వరకూ మేం పడ్డ పాట్లు అలాటివి మరి. ఆ ఊళ్ళో అద్దెకి ఇల్లు దొరకాలంటే బోలెడు పగిడీ కట్టాలి. స్వయంగా మేమే తాకట్టు కూచున్నా మాలాటి వాళ్ళకి ఎవడూ రూపాయి అప్పిచ్చేవాడు కాదు. అందుకని మాలాటి వాళ్ళమంతా సర్వెంట్ క్వార్టర్స్‌లో

ఇంకో జంటతో వంటిల్లు షేర్ చేసుకుంటూ కాలక్షేపం చేసుకునేవాళ్ళం. హాస్టల్లో వసతి దొరకడమనేది మా జీవితంలో ముఖ్యమైన సంఘటనగా చెప్పు కోవచ్చు. అక్కడే మాకు చందమావల్లాంటి చక్కటి పిల్లలు కలిగారు. మా ఆయనకి, నాకు డిగ్రీలు వచ్చాయి. పర్మనెంట్ ఉద్యోగాలతో బాటు ఇంకా పెద్ద ఇంట్లోకి మారగలిగిన అర్హతా వచ్చింది. అయినా మేం హాస్టల్ వదల్లేదు. నూరుమంది అబ్బాయిలూ, పాతికమంది అమ్మాయిలూ కోలాహలంగా తిరు గాడే నిత్య వసంతపు తోటని వదులుకుని బిక్కుబిక్కుమనే ఇంట్లోకి మార మంటే మాకేం ఉత్సాహం? మా పిల్లల్ని ఆ హాస్టల్లోని కుర్రాళ్ళు, పనివాళ్ళూ కలిసి వంతులేసుకుని ఆడించడంతో మా పని మరీ రికామిగా ఉండేది.

మాకు శని, ఆదివారాలు సెలవులు కాబట్టి ఆ రెండ్రోజులూ మా ఆయన హాస్టల్ కామన్ రూంలో ఉండే టేబుల్ టెన్నిస్ టేబిల్ యొక్క ఒక సైడుని ఆక్రమించి ఉండేవారు. ఇంక ఎవరు ఆడదల్చుకున్నా రెండో పక్క నుంచి రెండు మూడు గేమ్సాడి చమటలు కక్కుకుంటూ పోయేవారు. మా ఆయన మాత్రం కనీసం గ్లాసెడు మంచి నీళ్ళయినా అడక్కుండా అవతలి వాళ్ళని చితకబాదుతూండే వారు. నేను మా పిల్లల్నేసుకుని హాస్టల్లో రూములన్నీ తనిఖీ చేస్తూ తిరిగి భోజనాల టైంకి మా గూటికి చేరేదాన్ని. అలా తిరుగుతూ ఉన్న ప్పుడు ఒక రోజున డైనింగ్ హాల్లో గొడవ అవుతుంటే అటు వెళ్ళాను. మా హాస్టల్లో మెట్ల కింద ఉండే సర్దార్జీ ప్లేటు రెండు కటోరీలు పట్టుకుని వంటింటి దగ్గర నిలబడి వంటవాడితో పెద్ద తగవులాట పెట్టుకున్నాడు. 'ఇలాంటి వంట కుక్కలు కూడా తినవ'ని అరుస్తున్నాడు.

అక్కడున్న కుర్రాళ్ళు "మమ్మల్ని కుక్కలంటావురా! పోనీగదాని మేం అందరం కలసి నీకు భోజనం పెడుతుంటే ఇంత పొగరా? నీ మూలంగానే నలుగురు వంటవాళ్ళు పారిపోయారు. నీ కసలు తిండే పెట్టం!" అని మీద మీదకి వెళ్ళసాగారు. ఏమనుకున్నాడో ఏమో ఆయన ఆ కంచం అక్కడే వదిలేసి వెళ్ళిపోయాడు. ఆ హాస్టల్ పనివాళ్ళల్లో అతను ఒకడై ఉంటాడనుకుని అక్క డితో ఆ విషయం మర్చిపోయాను. చాలా రోజుల్నించి మా కళ్ళ ముందు తిరుగుతున్నా అతని గురించి ఏనాడూ పట్టించుకోనూ లేదు. ఎవర్నీ అడగనూ లేదు. ఆ తరువాత నాల్రోజులకి ఓ సాయంత్రం నేనూ మా ఆయనా ఏవో కబుర్లు వార్తలు ఎక్స్ఛేంజ్ చేసుకుంటూ నింపాదిగా ఇంటికొస్తున్నాం. మా మాటలు తెవలకపోతే ఆ గేటు దగ్గిరే నిలబడి ఆ కబుర్లు పూర్తయ్యాకే ఇంట్లోకి

వెళ్ళేవాళ్ళం. ఇంట్లో కూడా మాట్లాడుకోవచ్చు గదాని మాకు తోచేదే కాదు. మిగతా ఫ్రెండ్సంతా ఎంతో మేమిద్దరం కూడా ఒకళ్ళకొకళ్ళం అంతే! ఎప్పుడూ ఖాళీగా ఉండే మా హాస్టల్ గేట్, అడుగు పెట్టడానికి వీల్లేకుండా స్కూటర్లు, కార్లతో నిండి ఉంది. మరి ఇప్పటి రోజులు కాదు కదా! స్కూటరుంటేనే గొప్ప! ఇంక కారుంటే ఎంత గొప్ప! నంబర్లు చూస్తే మా డిపార్టుమెంట్స్ హెడ్స్‌విలా గానే ఉన్నాయి. కానీ వాళ్ళు స్టేటస్ కోసం కారుకొని షెడ్లో పెడతారు గానీ పెట్రోలు పోసి వాడరు కదా! ఇంత ఖర్చుపెట్టుకుని ఎందుకు వచ్చారా అని ఆలోచనలో పడ్డాం. పోనీమంటే ఈ వేళ మా 'హాస్టల్ డే' కూడా కాదు. డాక్టర్లు కపూరు గారూ, మాథుర్ గారూ, మల్హోత్రా గారూ, ఓం ప్రకాశ్ గారూ ఇలా పంజాబ్ నుంచి వచ్చి మా లాబ్‌లో పనిచేస్తున్న పెద్ద పెద్ద సైంటిస్టులంతా మా మెట్ల కింద అవుట్ హౌస్ ముందు నిలబడి గుసగుస లాడుకుంటున్నారు. ఏవిటా అని విచారిస్తే తెలిసింది. నాల్రోజుల నాడు వంటవాడితో పోట్లాడిన సర్దార్జీ పూర్తిగా తిండి మానేయడంతో చావసిద్ధంగా ఉన్నాడుట. ఈ నాల్రోజులూ ఎవరూ పట్టించుకోలేదు. ఈ వేళ హాస్టల్ పనివాళ్ళు చూసి హడావిడి చేస్తే అందరూ పరిగెత్తుకు వచ్చారన్నమాట.

పిచ్చాడిలా ఉండే ఈ సర్దార్జీని అన్నం తినమని బతిమాలేందుకు ఇంత మంది కట్టకట్టుకు వచ్చారా అని ఆశ్చర్యపోయాను. వాళ్ళ వాళ్ళ డిపార్టుమెంటు పెద్దలంతా రావడంతో మా హాస్టల్లోని అంతేవాసులు తెగ ఖంగారుపడిపోయి లాన్‌లో కుర్చీలేయించారు. అతిథులకి గౌరవ మర్యాదలు చేశారు. మరి వచ్చిన వాళ్ళు సామాన్యులు కాదు కదా! మాకు గురువులూ, గురుతుల్యులూను. విద్యార్థులంతా ఎంతో వినయంగా పచ్చగడ్డిలో కూచుని గడచిన ఆదివారం నడిచిన కథంతా విశదంగా చెప్పారు. తమరి తప్పేమీ లేదనీ, తాము తింటున్న భోజనమే అందరి కన్నా ముందు అతనికే పెడుతున్నామనీ చెప్పారు. కానీ ఒక రోజు ఆలూ ఉడకలేదనీ, ఇంకో రోజు పెరుగు పుల్లగా ఉందనీ, మర్నాడు చల్లారిన రొట్టెలు పెడుతున్నారనీ - ఇలా రోజుకో తగవు పెట్టుకుంటుంటే ఈ వంటవాడు కూడా పోతానని బెదిరిస్తున్నాడని విన్నవించుకున్నారు. వీళ్ళు చెప్పిన వన్నీ విన్న పెద్దలు సర్దార్జీ దగ్గిరకెళ్ళి మళ్ళీ ఇలాంటి పొరబాట్లు జరగవనీ, క్షమించి భోజనం చెయ్యమనీ బతిమాలారు. మంచం మీదాయన అడ్డంగా తలతిప్పాడు. మళ్ళీ వాళ్ళల్లో వాళ్ళు మాట్లాడుకుని రోజుకొకరి ఇంటి నించి భోజనం పంపిస్తామనీ ఒప్పుకోమనీ బతిమాలారు. మళ్ళీ సర్దార్జీ అడ్డంగా

తలతిప్పి ఇలా రోజుకొకళ్ళ తిండి తిని పోవడం కన్నా ఇప్పుడే పోవడం మంచి దని సూచించాడు. హాస్టల్ భోజనం మాత్రం చచ్చినా చెయ్యనని మళ్ళీ సంజ్ఞలు చేసి చెప్పాడు. ఈ లోపలే మా లాబ్ డాక్టర్ గారు రెండు బాటిల్స్ గ్లూకోజ్ ఎక్కించి వెళ్ళిపోయారు.

"ఇన్నాళ్ళ నుంచీ చూస్తున్నాను. ఎప్పుడూ ఎవరితోనూ మాట్లాడగా కూడా చూడలేదు. ఇప్పుడింత గొడవేమిటి?" అని కాస్త దూరంగా చెట్టుకింద కూచున్న సీనియర్ హాస్టలైట్‌ని అడిగాను.

"మీరే చూస్తున్నారుగా! మా అందరి డబ్బుతోనే కదా హాస్టల్ భోజనం చేస్తున్నదీ! అయినా మాలో ఒక్కళ్ళతోనైనా మంచిగా, మర్యాదగా ఉండడం చూశారా? పైగా తన డబ్బులొచ్చాక అణా పైసలతో తీర్చేస్తాడుట. ఇప్పుడేమో నాల్రోజుల నించీ ఏమీ తినక ప్రాణం మీదకి తెచ్చుకున్నాడు. మా గైడు నా మీద కళ్ళెర్ర చేస్తున్నాడు. నేనేదో సరిగా వండి పెట్టనట్లు! ఈ వంక పెట్టుకుని నా థీసిస్ వర్క్ ఇంకో ఆర్నెల్లు వాయిదా వేసినా వేయవచ్చు" అన్నాడతను.

"ఇది మరీ బాగుంది! సర్దార్జీకి ఇదేమన్నా అత్తారిల్లా వంట బాగా లేదని అలగడానికి! ఇలా ఇన్నేళ్ళ పాటు మీరంతా అతనికి ఊరికే భోజనం పెట్టడం ఏమిటి? ఎలా భరిస్తున్నారు?" అనడిగాను. అక్కడ ఇంకా చర్చలు జరుగు తుండగానే మా వారి ప్రొఫెసర్ గారు నన్నూ మా ఆయన్నీ రమ్మని కబురు పంపారు. మేం వెళ్ళగానే మా ఆయన్ని అతని ఎదురుగా నిలబెట్టి "వీళ్ళ అమ్మగారు వండి పెడితే తింటావా?" అనడిగారు.

"ఏ కొడుకూ తల్లి చేతివంట తిననని అనడు" అని అక్కడున్న వాళ్ళందరి నెత్తినా పాలు పోశాడు. ఆ విధంగా మా అత్తగారి చేతి రోటీలు తింటానని అంగీకరించి వాళ్ళ నెత్తిమీద బరువు నా నెత్తిన పెట్టాడు. అసలు మా అత్తగారికి పంజాబీ వంటలు గానీ, రోటీలు చేయడం గానీ రానే రాదు. కానీ ఏం చెయ్య గలం. గురువుగారు అభ్యర్థించినా అది ఆదేశమే కదా! ఆయన కోరికని కాదని రేపట్నించీ క్షేమం ఏ చెరువులో నీళ్ళు తాగాలి? అయినా ఇందులో మా ఆయనకి వచ్చిన ఇబ్బందేం ఉంది? అదెంత భాగ్యం అని పది మందిలో ఒప్పేసుకుని గురువు గారి కళ్ళకి బంగారు తండ్రిలా అయిపోయారు. ఆ పూటకి హల్వా చేసి పట్టుకెళ్ళి సర్దార్జీకి తినిపించి ఇంటికి వచ్చాను.

రాత్రి పడుకునే ముందు అత్తగారికి చెప్పాను. మర్నాటి నించీ అతని కోసం వేడిగా రోటీలు చేయాలనీ అవి నేను నేర్పిస్తాననీ! కానీ పంజాబీ వాళ్ళకి

తప్పని సరిగా పచ్చికూర ముక్కలు లేకపోతే భోజనం చేయలేరని చెప్పా. మర్నాడు పొద్దున్న లేచి చూసేటప్పటికి ఒక అరకిలో పిండి గట్టిగా అప్పడాల పిండిలా కలిపి ఉంచారు. వంకాయ, దొండకాయ, టమోటా, బెండ వగైరా కూరలన్నీ చిన్న ముక్కలుగా తరిగి డిష్‌లో రెడీగా పెట్టారు. ఆ ముక్కలన్నీ సాంబారులో పడేసి ఆవిడకి సలాడ్ చేయడం చూపించాను. మామూలుగా మా కోసం అయితే పొద్దున్న పూట నేను వంటింట్లోకే వెళ్ళేదాన్ని కాదు. ఇప్పుడీ సర్దార్జీ కోసం రోజూ పొద్దున్నే లేచి ఒక పంజాబీ కూరా, దాలూ, లస్సీ చేసి ఆఫీసుకి వెళ్ళేదాన్ని. పన్నెండు గంటలకి మా అత్తగారు వేడిగా అసలీ ఘీతో రోటీలు చేసి అతగాడికి భోజనం పెట్టేవారు. మా అదృష్టం కొద్దీ రాత్రిపూట అతను ఒక బన్నూ, గ్లాసుడు పాలూ మాత్రం తీసుకునేవాడు. ఈ కార్యక్రమం మేము ఆ ఊరు వదిలిపెట్టి వచ్చేవరకూ సుమారు రెండేళ్ళ పాటు జరిగింది. ఆ రోజున మా నెత్తిన ఈ భారం పెట్టిన పెద్దలు మళ్ళీ తిరిగి చూడలేదు. మా హాస్టల్ కోతిమూక ఊరుకోవచ్చు కదా! పిలిచి "సర్దార్జీ! రంగారావ్ కా ఘర్ కా ఖానా కైసాహై?" అని అడిగేవారు. "ఠీక్ హై! గరీబ్ ఆద్మీ హై! బాల్ బచ్చా వాలాహై" అని వెళ్ళిపోయేవాడు. మమ్మల్నంత మాటంటాడా అని నాకు వళ్ళు మండిపోయేది. పైపెచ్చు అతను భోజనం చేశాక రోజూ ఒక ఎర్ర డైరీలో డేటువేసి నా చేతో అత్తగారి చేతో సంతకం పెట్టించుకునేవాడు. ఎందుకంటే తనకి డబ్బులొచ్చాక నా డబ్బు నాకిచ్చేస్తాడుట. అలాగే పదేళ్ళ నుంచీ హాస్టల్‌లో ఎవరో ఒకరి చేత సంతకం పెట్టించుకునే వాడుట. "అతనికసలు విశ్వాసం లేదు. అలాటి వాడికి భోజనం పెడతానని ఎందుకు వప్పుకున్నార"ని మా ఆయన్ని నిలదీసేదాన్ని. "అతనికి మతిలేదని తెలిసి కూడా అతని మీద కోపం తెచ్చుకుంటావేమిటి? ఎంతటి వాడెలాగ అయ్యాడో తెలిసిన వాళ్ళెవరూ ఇలా మాట్లాడరు" అని నన్నే కోప్పడేవారు.

నిజమే! సుర్జిత్‌సింగ్ కథ తెలిసిన వాళ్ళెవరూ కంటతడి పెట్టకుండా ఉండలేరు. అతనితో పరిచయమైన ఈ రెండేళ్ళల్లో మా లాబ్‌లో సైంటిస్టుల ద్వారానూ, హాస్టల్ పాత పనివాళ్ళ ద్వారానూ, ఎన్నో నమ్మశక్యంగాని విషయాలు తెలిశాయి. అతను చాలా ఏళ్ళు ఇదే హాస్టల్లో మేం ఉండిన సూట్లోనే ఉండే వాడుట. పదేళ్ళ పాటు లాబ్‌లో దర్జాగా పెద్ద సైంటిస్టుగా పని చేసాడుట. అంతకు ముందు అతని చదువంతా ఇంగ్లండులోనే అయింది. వాళ్ళు మన దేశానికి స్వతంత్రం రాకముందు ఇప్పుడు పాకిస్తాన్‌లోని లాహోర్‌కు చెందిన

జమీందార్లుట. పార్టిషన్ అప్పుడు ఆస్తులన్నీ వదులుకుని కట్టుబట్టలతో ఇండియాకి పారిపోయి వచ్చారు. పంజాబ్‌లో కొన్ని పొలాలు మన ప్రభుత్వం వీళ్ళ కుటుంబానికి ఇవ్వడంతో ఇతని తల్లిదండ్రులూ మిగతా బంధువులూ అక్కడ సెటిలయి వ్యవసాయం చేసుకుంటూ ఉండిపోయారు. ఇతనికి స్వంత అన్న దమ్ములుగానీ, అక్కచెల్లెళ్ళు గానీ లేకపోవడంతో తల్లిదండ్రులు పంచప్రాణాలూ ఇతని మీదే పెట్టుకుని ఉండేవారు. స్వతంత్రం రాగానే మన దేశంలో ఈ లాబ్ మొదలు పెట్టగానే ఇక్కడికి వచ్చి చేరాడు. పెళ్ళి చేసుకోమని అమ్మా నాన్నా ఎంత బతిమాలినా వినకుండా పూర్తి రీసెర్చికే అంకితమైపోయి పదేళ్ళల్లో వందల పేపర్లు పబ్లిష్ చేశాడు. ఎప్పుడూ ల్యాబ్‌లో రోజుకి ఇరవై గంటలు పని చేయడం, ఏ రాత్రి వేళో వచ్చి నిద్దరపోవడం. అయన పని చేస్తున్న రోజుల్లో పంజాబ్ నించి ఏ కుర్రాడొచ్చినా తనతో ఉంచుకుని అన్నం పెట్టే వాడుట. అతను భోజనం చేయలేదని బాధపడి కళ్ళనీళ్ళు పెట్టుకున్న పెద్ద లందరూ ఒకప్పుడు అతని ఆప్యాయతనీ, ప్రేమనీ పొందిన వాళ్ళేనన్నమాట.

ఎప్పుడూ ఏవేవో ప్రాజెక్టుల గురించి ఆలోచిస్తూ మళ్ళీ తనే వాటిని కాదను కుంటూ అనేక మంది మేధావుల లాగానే ఒక అద్భుత పరిణామానికీ, అయోమయ పరిస్థితికీ మధ్యన ఉండే శూన్యంలో మసలుతూ చూసేవాళ్ళకి అను మానం కలిగించే స్థితిలో ఉండేవాడు. రీసెర్చి తప్ప మరో ప్రపంచం తెలియని ఆ అమాయక సైంటిస్టుని చూస్తే ల్యాబ్ డైరెక్టరు గారికి చిరాకుగా ఉండేది. ఇతన్ని తల్చుకుంటేనే ఆయనకి అనీజీగా ఉండేది. ఇతని ఆలోచనలన్నీ బహుప్రమాదంగా కనిపించేవి. కొంపదీసి అతను చేసే ఏ ఒక్క ప్రయత్నం కార్యరూపం దాల్చినా అతను ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన శాస్త్రవేత్త అయ్యే ప్రమాదం ఉందని భావించి తెగ బాధపడేవాడు. అదృష్టమో, దురదృష్టమో గానీ ఆ ఇద్దరిదీ ఒకటే ఫీల్డవడంతో ఒకరి సత్తా ఇంకొకరికి క్షుణ్ణంగా తెలియ డమే పెద్ద సమస్యకి దారితీసింది.

మన సూర్జిత్‌సింగ్ అసలే సర్దార్జీ. ఆపైన పదహారణాల సైంటిస్టు. ఏ ప్రాపంచిక బంధాలు లేనివాడు. ఇంక పదవుల కోసం పాకులాడే డైరెక్టరు లాంటి అల్పప్రాణుల్ని ఏం ఖాతరు చేస్తాడు? అందులో డైరెక్టరు గారి శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అంటే ఇతనికి ఏమాత్రం గౌరవం లేదు. "అసలు నీకేం వచ్చునని. ఏదో నీ అదృష్టంకొద్దీనో మా దురదృష్టం కొద్దీనో ఈ ల్యాబ్‌కి డైరెక్టరై మా మీద కర్రపెత్తనం చేస్తున్నావు!" అన్నట్లు చూసేవాడుట. డైరెక్టరు

కూడా మరి అంతో ఇంతో చేవవున్నవాడే కదా! తన పవరు చూపించీ, ఉప యోగించి ఒక కొత్త పోస్టుని క్రియేట్ చేసి దానికి సూర్జిత్‌సింగ్‌ని ట్రాన్స్‌ఫర్ చేసి చేతులు దులుపుకున్నాడు. మేధావులు రాజకీయం ఆడితే అవి పోలీసు మర్యాదల కన్నా చాలా కఠినంగా ఉంటాయి కదా! ఇంతకీ ఆ పోస్టు ఏమి టంటే ఎవరైనా విఐపిలు, విదేశీ శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు, దేశ నాయకులు వచ్చినప్పుడు వాళ్ళకి ల్యాబ్ అంతా చూపించడం, ప్రాజెక్టుల గురించి వివ రించడం, ప్రజలతో పారిశ్రామిక వేత్తలతో, రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలతో సత్సం బంధాలు కలిగి ఉండడం. ఇలాంటి బాధ్యతలున్న పిఆర్‌వో ఉద్యోగంలో ఆ అమాయకుడ్ని నియమించి డైరెక్టరు తన అధికారాన్ని నిరూపించుకున్నాడు. ప్రైవేటుద్యోగాలలో అయితే ఎవరెక్కడరాణించగలరో ఆ పనప్పగించి లాభాలు పొందుతారు. అదే ప్రభుత్వోద్యోగాల్లో అయితే అనర్హులని అందలం ఎక్కించీ, అర్హులకి అవకాశాలివ్వక అణగదొక్కి క్షమించరాని అపరాధాలు చేస్తూ దేశ ద్రోహం చేస్తారు కొందరు.

ట్రాన్స్‌ఫరై కొత్త పోస్టులో జాయినయ్యాక గానీ సూర్జిత్‌కి తన పట్ల జరిగిన మోసం అర్థం కాలేదు. వర్క్‌బెంచ్, లైబ్రరీ, కెమికల్స్ స్థానంలో సోఫాలు, స్టెనో, టెలిఫోనూ, అతిథులూ వెంటబడేటప్పటికి మనిషి బిత్తరపోయాడు. అస లెప్పుడూ అతితక్కువ మాట్లాడుతూ తన ఊహా లోకంలో చక్రవర్తిలా బతికే అతనికి ఊరందరితోను మంచిగా మసలాల్సి రావడంతో చిరాకు అసహనం ఎక్కువై పోయాయి. "మన డైరెక్టరుకి పిచ్చి. లేకపోతే నా లాటి వాడిని ఈ పోస్టుకి వెయ్యడమేమిటి?" అని అందరి ముందు ఆశ్చర్యపోయేవాడు. లైబ్రరీకి వెళ్ళడానికి గాని, ల్యాబ్‌లో ఒక ఎక్స్‌పెరిమెంట్ సెటప్ చేసుకోడానికి గానీ అవకాశం లేకుండా పోయింది. ఆ బిత్తరితనం అయోమయం తగ్గి అసలు మూలకారణం అర్థం అయ్యాక పట్టరాని కోపం మొదలైంది. లోలోపల పిచ్చి వేళ్ళూనుకోసాగింది. ఇంక రకరకాల డైలాగులు మొదలుపెట్టాడు. "ఎప్పుడో ఈ ల్యాబ్ మొత్తం బాంబుతో పేల్చేస్తాను! బాంబు చెయ్యడం నాకెడంచేత్తో పని. అది మా రూంలోనే తయారవుతోంద'ని డైరెక్టరుగారికి చేరేలా మాట్లాడడం మొదలుపెట్టాడు. ఇంకేంవుంది! పూర్తిగా వదిలించుకోడానికి ఆధారం దొరికినట్ల యింది పెద్ద దొర గారికి. ప్రపంచ ప్రసిద్ధి చెందిన జాతీయ ప్రయోగశాలకు ముప్పు తెచ్చే లక్షణాలు ఈ ఉద్యోగిలో కనిపిస్తున్నాయనే కారణంతో ముందు సస్పెన్షనూ, తర్వాత గేట్లోకి రానీయకపోవడం, చివరగా మూడు నెలల నోటీసిచ్చి

ఉద్యోగంలోంచి తీసెయ్యడం చాలా సహజంగా, న్యాయ ప్రకారంగా, శాస్త్ర యుక్తంగా జరిగిపోయాయి. అవి అలా ప్రాసీడవుతుండగానే ఇతనికి పిచ్చికూడా స్థిరపడిపోయింది. ఇతనికి రావలసిన డబ్బుల విషయంలో ఇతని లెఖ్ఖలకీ, అధిష్టానం వారి లెఖ్ఖలకీ తేడా రావడంతో ఇతని పిచ్చి కొత్త రూపుదాల్చింది. "వెధవ ఉద్యోగం పోతే పోయింది! ఈ పాటి రీసెర్చి ఇంట్లో కూడా చేసుకో వచ్చు. కానీ రావలసిన డబ్బులన్నీ వసూలు చేసుకోనిదే ఊరు వదిలి వెళ్ళన'ని కొత్త శపథం పట్టాడు. ఉద్యోగం పోయే వాటికి హాస్టల్ సూట్‌లో ఉండేవాడు కదా! ఖాళీ చేయమని ఆఫీసువాళ్ళు నోటీసిచ్చారు. పంజాబ్ నించి వాళ్ళమ్మా వాళ్ళు వచ్చి ఇంటికి పోదాం రమ్మన్నా వినలేదు. "ఇక్కడ్నించి డబ్బులు రాగానే వస్తానని మొండికేయడంతో ఏడుస్తూ తిరిగి వెళ్ళిపోయారు. లండన్‌లో చదువు కుని ఎంత వాడవుతాడోనని ఆశలు పెంచుకున్న బంగారమంటి కొడుకు పిచ్చి వాడై పోవడంతో తట్టుకోలేని ఆ పిచ్చి తల్లిదండ్రులు కొద్దికాలంలోనే కన్ను మూసి ఇతనిని పూర్తి అనాధని చేశారు.

కాకపోతే ఇతని వల్ల ఉపకారం పొందిన ప్రవాసీ పంజాబీలు మాత్రం ఇతన్ని గాలికి వదిలేయలేకపోయారు. హాస్టల్ కుర్రాళ్ళని ఒప్పించి మెట్ల కింద ఉన్న అవుట్ హౌస్‌లోకి ఇతని ఠికాణా మార్చి మెస్‌లోనే భోజనం పెట్టేలా ఏర్పాట్లు చేశారు. అయినా హాస్టలుగానీ, మెస్‌గానీ ఏ ఒక్కరికీ చెందినవి కాదు కదా. అదీగాక రోజుకి నూట యాభై మంది భోజనాలు చేసేచోట ఒక్కడికి భోజనం పెట్టడం ఏం కష్టం! అందుకే ఏ విషయమూ ఎవరి దృష్టికీ వెళ్ళకుండా ఇన్ని సంవత్సరాలు గడిచాయి. రోజా ఒక్కపూట భోజనం చెయ్యడం, ఏవో లెఖ్ఖలు చేసుకుంటూనో, పుస్తకాలు చదువుకుంటూనో కాలక్షేపం చేయడం. హాస్టల్ దాటి ఏనాడూ బయటకి పోయేవాడు కాదు. అప్పుడప్పుడు మొక్కలకి నీళ్ళు పెడుతుండేవాడు. పార్టిషన్ మూలంగా తనకి పోయిన ఆస్తులన్నిటి బదులుగా పంజాబ్‌లో తనకి బోలెడు పొలం వచ్చిందనీ, ఇక్కడ ఎకౌంటు సెటిలైపోతే తన ఊరు వెళ్ళిపోయి వ్యవసాయంలో రీసెర్చి చేసి కొత్త రకాలు కనిపెడతాననీ అందరికీ చెబుతుండేవాడు. ఇతని లెక్కలు తేలి తన స్వంత ఊరు వెళ్ళడం మాట దేవుడెరుగు. ఈ లోపల అతని దాయాదులంతా ఆస్తి అనుభవిస్తూ మేడలు మీద మేడలు కట్టుకుని సుఖంగా ఉండసాగారు.

మేం ఇంకో రెండేళ్ళ తర్వాత ఆ ఊరు వదిలేసి హైదరాబాద్ వచ్చేశాం. అప్పటి వరకూ అతనిని బాగానే చూసుకున్నాం. తరువాత మా పనులలో పడి

బిజీ అయిపోయాం. కొన్నేళ్ళకి మా ఫ్రెండ్స్ చెప్పారు. మేం వెళ్ళి పోయాక మళ్ళీ హాస్టల్లోనే తింటూ బాగానే ఉండేవాడుట. కానీ ఒకసారి చాలా జబ్బుచేసి బతకడనుకుని వాళ్ళ వాళ్ళకి కబురుచేస్తే వాళ్ళొచ్చి తీసుకుపోయారట. ఈయన సంతకం పెడితేగానీ వాళ్ళనుభవించే ఆస్తుల హక్కుదారుడెవరో తెలియదు కదా మరి! సరిగ్గా ఇలాంటప్పుడే భగవంతుడు "నేనేమై పోయాననుకున్నారు?" అని ప్రశ్నిస్తాడు. రేపోమాపో చావకపోతాడా అని ఎంతో ఉత్సాహంగా అందరూ సాయం పట్టి తీసుకుపోయి ప్రకృతి వైద్యశాలలో చేర్పిస్తే, ఇతని అనారోగ్యం తగ్గడమే కాకుండా పిచ్చికూడా పూర్తిగా నయమైపోయిందిట. కాకపోతే డైరెక్టరూ, హాస్టలూ, తనకి రావలసిన డబ్బులూ పోయిన ఉద్యోగం, అన్నీ మర్చిపోయాడట. మళ్ళీ కొత్త కొత్త పుస్తకాలు కొనుక్కుని చదువుకుంటూ పంటల మీద రీసెర్చి చేస్తూ హాయిగా ఉన్నాడని చెప్పారు. ఇవన్నీ తెలుసుకున్నాక అమ్మయ్యా కథ సుఖాంతం అయిందని సంతోషపడి మేమూ అతని గురించి మర్చిపోయాం!

ఇన్నేళ్ళకి అంటే సుమారు పాతికేళ్ళకి మేం ఎందుకు గుర్తుకొచ్చామో, అతనే అయివుంటే ఎలాగూ మళ్ళీ చేస్తాడు కదాని ఊరుకున్నా. సాయంత్రం మళ్ళీ ట్రంకాలు వచ్చింది. నేనే ముందు మాట్లాడా. "నమస్తే సూర్జిత్‌సింగ్‌జీ! ఆప్ కైసే హై! కైసే యాద్ కియా?" అని నా కొచ్చిన హిందీలో అడగ్గానే పాపం పొంగిపోయాడు. అమ్మ ఎలా ఉన్నారని అడిగాడు. పిల్లలేం చేస్తున్నారని అడిగాడు. మళ్ళీ క్షమించమని పాట మొదలుపెట్టాడు. 'సరే క్షమించాను' అన్నాక ఇంటర్వెల్లు తర్వాత కథ చెప్పాడు. మేం వచ్చేశాక అయిదారేళ్ళకి తనకి చాలా జబ్బు చేసిందనీ వాళ్ళ ఊళ్ళో ఒక ప్రకృతి వైద్యుడు మూలికా వైద్యం చేసి తనకి పూర్తిగా నయం చేశాడనీ, కానీ పాత విషయాలన్నీ మర్చిపోయాననీ చెప్పాడు. అప్పుడప్పుడు లీలగా అత్తగారు మా పిల్లలు గుర్తొచ్చేవారుట గానీ ఎవరో తెలిసేది కాదుట. తన సామాన్లు, పుస్తకాలు అన్నీ కపూర్ సాబింట్లో వదిలేసి వచ్చాడట. ఆర్నెల్ల క్రితం కపూర్‌సాబ్ పోయాక, ఆయన పిల్లలు ఇతని పుస్తకాలు చూసి ఇతనికి పంపించేశారుట. అందులో దొరికిన ఎర్ర డైరీలు చదివాక అర్థం అయిందిట. తను హాస్టలు వాళ్ళకీ మాకూ ఎంత ఋణపడ్డదీ! వెంటనే ఒక ట్రస్టు పెట్టి అందులోంచి ఏటా ఇద్దరు రీసెర్చి స్కాలర్స్‌కి స్కాలర్ షిప్ మూడేళ్ళపాటు ఇచ్చేలా ఏర్పాటుచేసి లాబ్‌కి అప్పచెప్పాడుట. కానీ మా ఋణం ఎలా తీర్చుకోవాలో అర్థంకాక మా అడ్రసు తెలియక చాలా దిగులు పడ్డాడట. కొందరు తెలుగువాళ్ళ ద్వారా మా నంబరు తెలుసుకుని ఫోన్ చేశా

న్నాడు. తను డి.డి పంపిస్తాననీ, తనని క్షమించమనీ, కాదన వద్దనీ, కాదంటే అతని ఆత్మకి శాంతి ఉండదనీ పదే పదే బతిమాలాడు. అవతల నుంచి లైను కంటిన్యూ అవుతూనే ఉంది. నాకేం చెయ్యాలో తోచక రంగారావుని పిలుస్తానని చెప్పి ఈయనకిచ్చాను. మళ్ళీ మా ఆయన ఫోనులో అంతా విని "సార్! మీరు మాకివ్వదల్చుకున్నది మా తరపున గురుద్వారా కిచ్చేయండ'ని చెప్పి అతనిని ఋణ విముక్తుడిని చేసి ఫోను పెట్టేశారు.

ఎక్కడికెడదామన్నా ససేమిరా అనే మా పెద్ద మనిషి మా జీవితంలో మొదటిసారి "ఒక్కసారి పంజాబ్ వెళ్ళొద్దాం! అతనెంతో వర్క్ చేస్తూ రకరకాల పంటలు పండిస్తున్నాడుట. మనల్ని చూసేందుకు రమ్మని చెప్పాడు" అని అంటూ నా చెవిలో అమృతం పోశారు.

-ఏప్రిల్ 2005, నవ్యవీక్లి

✦ ✦ ✦